సాగుకు సాంకేతిక దన్ను

- డ్రమ్‌సీడర్‌తో నేరుగా వరి నాటు
- ఎకరాకు రూ.8వేల వరకు ఖర్చు ఆదా
- కూలీల కొరతకు చెక్
- మండలంలో 15వేల ఎకరాల్లో వరి సాగు



డ్రమ్‌సీడర్‌తో విత్తనం నాటుతున్న రైతు

ఎల్లారెడ్డిపేట: మారుతున్న కాలానుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో రైతులు పంటలసాగులో నూతన పద్ధతులు అవలంభిస్తూ పెట్టుబడి భారం తగ్గించుకుంటున్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఊతమిస్తూ నూతన వంగడాలపై అధికారులతో అవగాహన కల్పించి అవసరమైన పనిముట్లను అందుబాటులోకి తెస్తున్నారు. రైతులకు తక్కువ అద్దెపై పనిముట్లు అందిస్తున్నారు. మండలంలోని 24 గ్రామాలు 10 తండాల పరిధిలో ఈ వానాకాలం సీజన్‌లో 15వేల ఎకరాల్లో వరిపంట సాగుచేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అందులో డ్రమ్ సీడర్‌తోనే 6వేల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. గత ఖరీఫ్ సీజన్‌లో డ్రమ్‌సీడర్‌తో రూ.5వేల ఎకరాల్లో నాట్లువేసి జిల్లాలోనే మండల రైతులు ఆదర్శంగా నిలిచారు. కూలీల కొరత అధికంగా ఉండగా ఈ సమయంలో డ్రమ్ సీడర్ పద్ధతితో వరినాట్లు వేస్తూ ఎకరాకు రూ.8 వేల వరకుఖర్చులు అన్నదాతలు ఆదా చేసుకుంటున్నారు.

డ్రమ్‌సీడర్‌తోనే నేరుగా వరినాట్లు..

రైతులు నారుమడులు సిద్ధం చేసుకొని వడ్లను నానబెట్టి మొలకెత్తిన అనంతరం నారు మడుల్లో చల్లి వరినారును పెంచి నాట్లువేయడం అనాదిగా వస్తోంది. అయితే కాలానుగుణంగా డ్రమ్‌సీడర్‌తోనే నేరుగా వరి నాట్లు వేస్తున్నారు. దీంతో నారు మొలకెత్తే వరకు పెంచడం, నాట్లువేసే సమయంలో నారు గుంజడం, నారు పీకడం లాంటి నాటు కూలీల ఖర్చులన్నీ ఈ పద్ధతి ద్వారా రైతులకు ఆదా అవుతోంది. ఈ ఖర్చులన్నీ కలిపితే ఎకరం విస్తీర్ణంలో రూ.8వేల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. డ్రమ్‌సీడర్‌తో ఖర్చులన్నీ రైతులకు తప్పడంతో వారు నూతన పద్ధతిలోనే వరి పంట సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

విత్తనాలు ఆదా..

- మామూలు పద్ధతితో ఎకరానికి 25 నుంచి 30 కిలోల నుంచి విత్తనాలు అవసరముంటాయి.
- డ్రమ్‌సీడర్‌తో కేవలం 12 నుంచి 15 కిలోల వరకే విత్తనాలు అవసరపడతాయి.
- ఖర్చు తప్పడమే కాకుండా డ్రమ్‌సీడర్‌తో వరుస పద్ధతిలో 12 ఇంచుల గ్యాప్‌తో నాటు వస్తుంది.
- వరుస పద్ధతిలో నాటు పడడంతో గాలి, వెలుతురు పడి వరి బాగా పెరిగే అవకాశం ఉంటుంది.
- పంటకు చీడపీడలు సోకితే సులభంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే అవకాశం ఉంది
- డ్రమ్‌సీడర్‌తో నాటు వేస్తే వారం ముందుగానే పంట చేతికొస్తుంది.

అవగాహన కల్పించాలి



వ్యవసాయ పద్ధతిలో ఎన్నో మార్పులు వస్తున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు రైతులకు నూతన యంత్రాలపై అవగాహన కల్పించాలి. యంత్రాల పనితీరు, ఖర్చు తదితర విషయాలు తెలిపితే తాము కొత్త పద్ధతిలో వరి నాట్లు వేస్తాం. డ్రమ్‌సీడర్‌తో వరి నాట్లు వేసిన రైతులు తమకు పెట్టుబడులు తగ్గినట్లు చెబుతున్నారు.
–అజ్మీరా లక్ష్మణ్, రైతు, గుంటపల్లి చెరువుతండా

అందుబాటులో ఉంచాలి



రైతులకు అద్దె పనిముట్లు అందుబాటులో ఉంచాలి. ప్రైవేట్‌గా పనిముట్లు తీసుకుంటే రైతులపై అధికభారం పడుతోంది. డ్రమ్ సీడర్‌లను అందుబాటులో ఉంచితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. డ్రమ్ సీడర్ వరినాట్లు వేస్తే పెట్టుబడులు ఆదా అవడంతో పాటు దిగుబడి ఎక్కువగా వస్తుంది.
– నిమ్మల బాబు, రైతు, దుమాల

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించాలి. వ్యవసాయశాఖ సూచనలతో రైతులు నూతన పద్ధతులు అవలంబిస్తూ పెట్టుబడి భారం తగ్గించుకోవాలి. డ్రమ్‌సీడర్‌తో కూలీల కొరతతోపాటు పెట్టుబడి తగ్గుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– చాడ భూంరెడ్డి, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

పార్క్‌ను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



వేములవాడఅర్బన్: వేములవాడ మండల పరిషత్ కాంపౌండ్ ఆవరణలో రూ.2 కోట్లతో పార్కును నిర్మాణం చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు బుధవారం సందర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్ మాట్లాడుతూ.. పార్క్ నిర్మాణం కేవలం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో పూర్తయిందన్నారు. పార్క్ నిర్మాణ విషయంలో కాంగ్రెస్ నాయకుల పాత్ర ఏమిలేదని, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి చేసిన వ్యాఖ్యలపై నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్నారం ఉమారాణి, ఇప్పపూల అజయ్, సాగరం వెంకటస్వామి, పాతసత్యలక్ష్మి, కనికరపు రాకేశ్, పుల్కం రాజు, గూడూరి మధు తదితరులు ఉన్నారు.

ఘనంగా బోనాలు



బోనాలతో కౌన్సిలర్ నీరజ, తదితరులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో మైసమ్మ, పోచమ్మ బోనాలను బుధవారం నిర్వహించారు. కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో కౌన్సిలర్ నీరజ, భూపతినగర్‌లో కౌన్సిలర్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలకేంద్రంలోని మేర సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో గ్రామంలోని డప్పుచప్పుళ్లు, బైండ్లోళ్ల ఆటపాటల మధ్య ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవార్లకు బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, మేరసంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట: సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. నిజామాబాద్‌లో ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం సందర్శించి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉపకేంద్రంలోని రికార్డులు తనిఖీ చేసిన అనంతరం మాట్లాడారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే ప్రతి రోజూ చేయాలన్నారు. చిన్నారులకు వ్యాక్సిన్ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రషీద్, ఏఎన్ఎం దీపిక, ఎంఎల్‌హెచ్‌పీ సన్నిహిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్మితా సబర్వాల్‌ను సస్పెండ్ చేయాలి'

ఎల్లారెడ్డిపేట: దివ్యాంగులను అవమాన పరిచిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎమ్మెస్పీ) జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం విలేకరుల మాట్లాడారు. అన్ని వర్గాలను సమానత్వంతో చూడాల్సిన ఐఏఎస్ అధికారులే ఇలా మాట్లాడడం బాధాకరమన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రిలో కైర శేఖర్ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.35వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి పార్టీ తరపున ఆర్థికసాయం అందేలా చూస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు పాలకుర్తి పర్శరాములు, బొడ్డు రాములు, రోమాల ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్, శంకరయ్య, రాజేశ్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

వేములవాడఅర్బన్: మున్సిపల్‌లో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ వేములవాడ మున్సిపల్ ఆఫీస్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.25లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని కోరారు. ప్రతీనెల రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం కమిషనర్ అన్వేశ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి మల్లేశం, వేణు, క్రాంతి, రాజశేఖర్, మహేశ్, పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ బస్సు డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సులు నడపవద్దన్నారు. అత్యవసర సమయంలో ఫోన్ మాట్లాడాల్సి వస్తే బస్సును పక్కన ఆపి మాట్లాడాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. బస్సులను రోడ్డు పక్కన నిలిపేటప్పుడు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



సిరిసిల్ల టౌన్: సిరిసిల్లలో కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్: మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా, ఎమ్మెల్యే క్యాంపు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుడు కుడిక్యాల నాగరాజు భార్య లావణ్య, మరో నేత కార్మికుడు తడుక శ్రీనివాస్ భార్య లావణ్యకు రూ. 25వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. తెలంగాణ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కుంభాల మల్లారెడ్డి, రామ్మోహన్, అక్కరాజు శ్రీనివాస్, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో బీఆర్ఎస్ నాయకులుకోడె మొక్కు చెల్లించి ప్రత్యే పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, పోలాస నరేందర్, హరిచరణ్‌రావు ఉన్నారు.

బోయినపల్లి: మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, లెంకల సత్యనారాయణరెడ్డి, గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాసరెడ్డి, అంజన్‌రావు, కొనుకటి నాగయ్య, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా డే కేర్ కేంద్రంలో వృద్ధులకు దుప్పట్లు, బ్యాగులను మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబరాలు జరిపారు. ఆలయాల్లో పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు వెంకటనర్సింహరెడ్డి, ఎడ్ల సందీప్, పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మాజీ ఎంపీపీలు పడిగెల మానస, పూసపెల్లి సరస్వతి, మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య, సిరిసిల్ల సింగిల్విండో వైస్‌చైర్మన్ వెంకట రమణా రెడ్డి, పాల్గొన్నారు.

గంభీరావుపేట: నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గోరింటాల, గజసింగవరం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ మండల, పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, వెంకటి యాదవ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, మహిళా విభాగం మండల నాయకురాలు పిట్ల శ్రీమతి, మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కూర సురేశ్, పాల్గొన్నారు. ముస్తాబాద్ మండలంలో తెలంగాణ చౌక్‌లో పటాకులు కాల్చి కేక్ కట్ చేశారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలో కేటీఆర్ బర్త్ డే సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, నాయకులు మహేందర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు కమలాకర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: గిఫ్ట్ ఏ స్మైల్ కింద మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ 150 మంది కూలీలు, హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. పోతుగల్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. నాయకులు పర్శరాములు, శంకర్, రాజు, బాలయ్య, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

సిరిసిల్లటౌన్: స్మైల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్‌లో 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో' పోస్టర్లను బుధవారం జిల్లాకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సబ్బం ప్రకాశ్, కోశాధికారి సాప సుధాకర్, మాదాసు రమేశ్, సజ్జనం సురేశ్, రాజు, సాగర్, అరవింద్, ప్రకాశ్, శ్రీనివాస్, కృష్ణ, శేఖర్, పాల్గొన్నారు.

బోయినపల్లి: హైదరాబాద్‌లో ఈనెల 26,27,28 తేదీల్లో జరిగే ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్‌ను మండల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బుర్ర శివ, ఉపాధ్యక్షుడు మండల శ్రీనివాస్, గురజాల కోటి, బిల్ల రవి, రోమాల తిరుపతి, అజంతా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ క్రేజీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ఎక్స్‌పో కరపత్రాన్ని ఎస్సై గణేశ్ ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తాడెపు రవి, ఫొటోగ్రాఫర్లు దుబ్బాక రాజు, శ్రీకాంత్, వేణు, వెంకటేశ్, నందు, మహేశ్, కన్నా కృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేత

గంభీరావుపేట: మల్లుపల్లి గ్రామానికి చెందిన గడ్డి హరీశ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్ కమిషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పంటల వివరాలు నమోదు



వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో శ్రీదేవి

బోయినపల్లి: మండలంలోని తడగొండలో ఏఈవో శ్రీ దేవి ఆధ్వర్యంలో బుధవారం రైతుల పంటల నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వానాకాలంలో వేసిన వివిధ రకాల పంటల వివరాలను ఏఈవో సేకరించారు. నమోదులో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అనుమానితుడు



సిరిసిల్లక్రైం: వైద్యం కోసం వచ్చిన వారి నుంచి రాత్రి వేళ సెల్ ఫోన్లు దొంగతనం చేస్తున్న అనుమానితుడి ఫొటోను సిరిసిల్లటౌన్ పోలీసులు బుధవారం విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో ఒకరు రాత్రి సమయంలో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు రావడంతో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ తెలంగాణకు మొండిచేయి చూపిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రుపాయి ఇవ్వకుండా, ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.26 వేల కోట్లు ప్రకటించారన్నారు. బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల వారిని నిరాశ పర్చిందన్నారు. తెలంగాణపై కక్ష సాధింపు ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు ఏలూరి రాజయ్య, గౌస్‌బాయి, లింగం గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, బండారి బాల్‌రెడ్డి, బాబు, దేవేందర్ యాదవ్, ఇమామ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



కోనరావుపేటలో చెక్కు అందజేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలకేంద్రానికి చెందిన బోయిని దేవయ్యకు రూ.9వేలు, నేరెళ్ల లచ్చయ్యకు రూ.12 వేలు, పని కవితకు రూ. 14,500 సీఎం సహాయనిధి కింద మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎంపీటీసీ దేవరకొండ నర్సింహాచారి బుధవారం అందించారు. మండలంలోని కనగర్తిలో రావులపెల్లి రాజశేఖర్‌కు రూ.10,500, మారుపాక రోహిత్‌కుమార్ రూ.9వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ అధ్యక్షుడు వంగపెల్లి దేవరాజు అందజేశారు. మామిడిపల్లికి చెందిన ఎంద్రాల లత రాజుకు రూ.12,500 చెక్కును గుండెకార్ల సంజీవరావు, జవ్వాజి రాములు, నంద్యాడపు సాగర్, ప్రేమ్‌చంద్ అందించారు. సింగిల్‌విండో డైరెక్టర్ రమేశ్‌రెడ్డి, మాందాల లింబయ్య, జిల్లెల్ల లక్ష్మారెడ్డి, మారుపాక శంకర్, లచ్చయ్య, అనిల్, పద్మాకర్, పర్శరాములు, ముత్తయ్య.. లింగారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మపల్లిలో..

నిమ్మపల్లిలో షేక్ ఇర్ఫాన్, దుంపెటి ప్రదీప్, అంజయ్య, మారుపాక జలజ, దొంతరవేణి భవానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను చేపూరి గంగాధర్, పెంతల శ్రీనివాస్ అందజేశారు. మానుక సత్యం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్ల, చెక్కపల్లి గ్రామాల్లో దూస శ్వేత, బొంగారపు భూంరెడ్డి, దామెర్ల శ్యామలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సోయినేని కరుణాకర్, అడ్డిక శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, ఎడపెల్లి అనిల్, కొముురయ్య, తిరుపతిరెడ్డి, రాజేందర్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



చందుర్తి: మండలంలోని ఎన్గల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిత్‌గా పనిచేస్తున్న వీరగోని చైతన్యగౌడ్‌ను జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఉస్మానియా యూనివర్సిటీలో సంస్కృత విభాగంలో పీహెచ్‌డీ పట్టా సాధించి డాక్టరేట్ పొందడంపై అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు సునీతరాణి, ఉపాధ్యాయులు నరేందర్, లక్ష్మీనారాయణ, కృష్ణచైతన్య, కవిత, ఉదయ్ భాస్కర్, పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హిందీ టీచర్ సబిత, తెలుగు టీచర్ ఓదెలు ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. విలాసాగర్ హైస్కూల్ పీటీ తోకల మధుకర్‌రెడ్డి నర్సింగాపూర్‌కు బదిలీ అయ్యారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విలాసాగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్, మల్కాపూర్ హెడ్ మాస్టర్ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులున్నారు.

రైస్‌మిల్ కార్మికునికి గాయాలు ?

వేములవాడ రూరల్: మండలంలోని మర్రిపల్లి శివారులో ఉన్న రైస్ మిల్లులో పనిచేసే కార్మికుడికి ప్రమాదం జరిగినట్లు తెలిసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన మనీష్ కుమార్ అనే కార్మికుడు కొన్నినెలలుగా రైస్‌మిల్లులో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి మిల్లులోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ విషయాన్ని బయటకు రాకుండా యజమాని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. కార్మికులకు అంతర్గతంగా ఉన్న గొడవలా? లేక మిల్లులో జరిగిన ప్రమాదమా అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయంపై ఎస్సై మారుతిని వివరణ కోరగా మద్యంతాగి మిల్లులో జారిపడటంతోనే ప్రమాదం జరిగినట్లు ఆయన తెలిపారు. ప్రమాద విషయాన్ని యజమాని గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కాంగ్రెస్‌లో చేరిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలకు చెందిన జనశక్తి మాజీ డీసీఎం గుర్రం మహేశ్‌తో పాటు రాగట్లపల్లికి చెందిన మందాటి లక్ష్మణ్ బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ఏలూరి రాజయ్య, లింగంగౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

తంగళ్లపల్లి: రైతుబీమా నమోదు కోసం మండలంలోని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వయస్సున్న వారు ఆగస్టు 5లోపు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, నమోదుపత్రంపై సంతకం చేసి ఇవ్వాలని సూచించారు. గతంలో రైతుబీమా ఉన్న రైతులు కూడా నమోదులో తప్పులు ఉంటే సవరించుకోవచ్చని పేర్కొన్నారు.

• విద్యార్థులకు వైద్యపరీక్షలు

వేములవాడఅర్బన్: పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులకు ఆర్‌బిఎస్‌కే ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యురాళ్లు లహరిక, పావని మాట్లాడుతూ ఎనీమియా ముక్తభారత్‌లో భాగంగా చిన్నారులకు రక్తహీనతపై అవగాహన కల్పించి అవసరమైన మందులు అందజేశామన్నారు. ప్రిన్సిపాల్ స్వప్న, ఫార్మసిస్ట్ గౌస్, ఏఎన్ఎం సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

• మానవత్వం చాటుకున్న పోలీసులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి వారిని చూసి తన వాహనంలో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

• విద్యారంగాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

గంభీరావుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉన్నత విద్యాసంస్థలు, కేంద్ర విశ్వ విద్యాలయాల అభివృద్ధి నిధులు ఇచ్చే యూజీసీకి భారీగా నిధుల్లో కోత పెట్టారని, విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కల్యాణ్‌కుమార్ అన్నారు. విభజన హామీ చట్టంప్రకారం రాష్ట్రంలో ట్రిపుల్ ఐటీ డివిజన్, నవోదయ పాఠశాలల ఏర్పాటు చేయుటకు బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

• కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ తీవ్ర అన్యాయం జరిగిందని ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్షపూరితంగా వ్యవహరించిందన్నారు.

• పనికి తగిన వేతనం చెల్లించాలి

చందుర్తి: పనికి తగ్గ వేతనాన్ని చెల్లించాలని కోరుతూ మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం భిక్షాటన చేశారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. గసికంటి లచ్చయ్య, నరేశ్, నారాయణతదితరులు పాల్గొన్నారు.

• వాహనాలకు పోలీస్ సైరన్ అమర్చితే చర్యలు

రుద్రంగి: పోలీస్ సింబల్స్, సైరన్ అమర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై సిరిసిల్ల అశోక్ హెచ్చరించారు. మండలకేంద్రంలో ట్రాక్టర్‌కు పోలీస్‌సైరన్ అమర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పట్టుబడిన జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారిపేట తండాకు చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ లావుడ్య దినేశ్, యజమాని కున్సోత్ అంగూర్, సైరన్ విక్రయించిన శ్రీధర్‌రావుపై బుధవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు వేలంపాట

రుద్రంగి: మండలకేంద్రంలోని దుర్గమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వహించే వేలంపాటలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని దుర్గమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈర్లం నరేందర్ కోరారు. ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి లక్ష్మణ్‌రావు తదితరులున్నారు.